క్లుప్తంగా

'హామీలు అమలు చేయాలి'

భైంసారూరల్: సీఎం కేసీఆర్ ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీపీ ఐఎంఎల్ ప్రజాపంథా జిల్లా కార్యదర్శి నంది రామయ్య డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని దేగాంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి ఏళ్లు గడుస్తున్నా దళితులకు మూడెకరాలు, రైతులకు లక్ష రుణమాఫీ, నిరుద్యోగ భృతి, అర్హులకు డబుల్ బెడ్రూం ఇళ్లు వంటి హామీలను అమలు చేయడం లేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. రాజన్న, మహేందర్ తదితరులున్నారు.

ఆటో యూనియన్ సభ్యుల చేయూత


నగదు అందిస్తున్న యూనియన్ సభ్యులు

కుంటాల: కుంటాలకు చెందిన అయిట్ల నవీన్ కుమార్ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి స్థానిక ఆటో యూనియన్ సభ్యులు అండగా నిలిచారు. శనివారం నవీన్ తల్లి లక్ష్మికి రూ.22వేల నగదు అందించారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ సభ్యులు ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలు తనిఖీ

ఖానాపూర్: అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణలో భాగంగా రిజిస్టర్లను సిబ్బంది విధిగా అప్‌డేట్ చేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీలత అన్నారు. శనివారం మండలంలోని సుర్జాపూర్-1, సుర్జాపూర్-2, మేడంపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రాలకు వచ్చే లబ్ధిదారులకు పౌష్టికాహారం అందించాలన్నారు. శుభ్రత పాటిస్తూ సరుకులను ఎప్పటికప్పుడు పంపిణీ చేయాలని కోరారు.

ముగిసిన ఇలేగాం జాతర

భైంసారూరల్: మండలంలోని ఇలేగాంలో బాపూజీ మహారాజ్ జాతర శనివారం ముగిసింది. రెండు రోజుల పాటు సాగిన జాతరకు సరిహద్దు ప్రాంతమైన మహారాష్ట్ర నుంచి భారీగా తరలివచ్చారు. శనివారం ఉదయం బాపూజీ మహారాజ్ ఆలయంలో పూజలు అనంతరం కీర్తనలు ఆలపించారు. భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ప్రాంగణంలో ఏర్పాటు చేసిన దుకాణాల వద్ద సందడి నెలకొంది. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

'వనదర్శిని'లో విద్యార్థులు


అధికారులతో మామడ పాఠశాల విద్యార్థులు

మామడ: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల విద్యార్థులు శనివారం అటవీప్రాంతం సందర్శించారు. వనదర్శినిలో భాగంగా మామడ అటవీక్షేత్రం పరిధిలోని సోలార్‌ప్లాంట్, సాసర్‌పిట్‌లు, చెక్‌డ్యాంల నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అటవీశాఖ అధికారులు విద్యార్థులకు అడవుల ప్రాముఖ్యతను వివరించారు. ఎఫ్ఎస్ఓలు లక్ష్మణ్, సంధ్య, ఎఫ్‌బీఓ రమేశ్, కమలాకర్, మౌనిక, ఉపాధ్యాయుడు గోవింద్ ఉన్నారు.

భూమిపూజ

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని సోఫినగర్‌లో మైనార్టీ కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణానికి శనివారం మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మంత్రి ఐకేరెడ్డి చొరవతో రూ.ఐదు లక్షలు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు రాము, కౌన్సిలర్ మతిన్, కాలనీవాసులు పాల్గొన్నారు.

పంచాయతీలకు విద్యుత్ కనెక్షన్ల తొలగింపు

ముధోల్: మండలంలోని 19 గ్రామపంచాయతీ కార్యాలయాలకు విద్యుత్‌సరఫరాను శనివారం నిలిపివేశారు. విద్యుత్ ఏఈ శ్రీకాంత్, ఎస్ఈ పాష, లైన్‌మెన్ సాయినాథ్, హల్దార్ గ్రామపంచాయతీ కార్యాలయాల కనెక్షన్లు తొలగించారు. 19 గ్రామపంచాయతీలకు సంబంధించి రూ.కోటీ 26లక్షలు బకాయిలున్నట్లు వారు తెలిపారు. సకాలంలో బకాయిలు చెల్లిస్తే కనెక్షన్లు పునరుద్ధరిస్తామని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

తానూరు: జౌలా(బీ) గ్రామ సమీపంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మహారాష్ట్రలోని ధర్మాబాద్ తాలూకా కర్కెల్లి గ్రామానికి చెందిన అరుణ్ గాయపడ్డాడు. ధర్మాబాద్ నుంచి తానూరుకు ద్విచక్రవాహనంపై వస్తున్న అరుణ్ జౌలా(బీ) గ్రామ సమీపంలో అదుపు తప్పి కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో గాయపడ్డ అరుణ్‌ను ఘటనాస్థలికి చేరుకున్న ఎస్సై విక్రమ్ 108లో భైంసా ఏరియాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం నిజామాబాద్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు.

వృథాగా పశువుల నీటి తొట్టెలు

- దాహార్తి తీర్చుకునేందుకు అల్లాడుతున్న మూగజీవాలు
- ఆందోళన చెందుతున్న రైతులు
- పలుచోట్ల శిథిలావస్థకు చేరిన వైనం
- పట్టించుకోని అధికారులు


ధర్మోరలో పగుళ్లు తేలిన నీటి తొట్టి


రాయపూర్‌కాండ్లీలో నిరుపయోగంగా నీటి తొట్టి

లోకేశ్వరం: వేసవిలో మూగజీవాల దాహార్తి తీర్చేందుకు జాతీయ గ్రామీణ ఉపాధిహామీ నిధులతో ఏర్పాటు చేసిన పశువుల నీటి తొట్టెలు నిరుపయోగంగా మారాయి. నిర్వహణ సరిగా లేక సింగిల్‌ఫేజ్ మోటార్ల వద్ద ప్రజాకుళాయిలు, ట్యాంకుల వద్ద నిర్మించిన తొట్టెలు శిథిలావస్థకు చేరాయి. దీంతో మూగజీవాలు తమ దాహార్తి తీర్చుకునేందుకు అల్లాడుతున్నాయి.

మండలంలో..

లోకేశ్వరం మండలంలో 25 గ్రామ పంచాయతీలున్నాయి. ప్రత్యేక పంచాయతీలు ఏర్పడక ముందు మండలంలో ఉన్న పంచాయతీకొకటి చొప్పున 15 నీటి తొట్టెలు నిర్మించారు. ధర్మోర, గొడిసెరాలో ట్యాంకు వద్ద నిర్మించిన పశువుల నీటి తొట్టెలు ఇప్పటికే ధ్వంసం అయ్యాయి. రాయపూర్‌కాండ్లీ, ధర్మోరలో పగుళ్లు తేలడంతో నీటి సరఫరా జరగడం లేదు. జోహర్‌పూర్, కన్కపూర్‌లో నిర్మించిన నీటి తొట్టెలు సైతం నిరుపయోగంగా మారాయి.

అధికారులు దృష్టి సారించాలి..

మండలంలో ఆవులు, గేదెలు 19వేలు, గొర్రెలు, మేకలు కలిపి 75 వేల వరకు ఉన్నట్లు పశువైద్య సిబ్బంది తెలిపారు. ప్రభుత్వం పశువుల సంరక్షణకు పథకాలు ప్రవేశ పెడుతున్నా.. సంబంధిత అధికారుల నిర్లక్ష్యంతో అవి నీరుగారుతున్నాయనే విమర్శలు వస్తున్నాయి. వేసవి వస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో ఉన్న చెరువులు, కుంటల్లో నీరు అడుగంటుతోంది. రానున్న రోజుల్లో జీవాలకు నీటి కష్టాలు తప్పకపోవచ్చు. రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన పశువులు నీటి తొట్టెలు వృథాగా మారుతున్నాయి. అధికారులు స్పందించి మరమ్మతుల అనంతరం తొట్టెల్లో నీటిని నింపి పశువుల దాహార్తి తీర్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వినియోగంలోకి తీసుకొస్తాం

పశు పోషకులెవరూ ఆందోళన చెందవద్దు. ఆయా గ్రామాల్లో నిరుపయోగంగా ఉన్న పశువుల నీటి తొట్టెలను పరిశీలిస్తాం. అవసరమైన చోట మరమ్మతులు నిర్వహించి.. నీటిని నింపుతాం. మూగజీవాలకు ఇబ్బంది కల్గకుండా వాటిని వినియోగంలోకి తీసుకొస్తాం.

–జగన్నాథ్, ఏపీవో, లోకేశ్వరం

ఇబ్బంది పడుతున్నాం



గ్రామంలో నీటి తొట్టెలు నిరుపయోగంగా ఉండటంతో పక్కనున్న చెరువు వద్దకు పశువులను తోలుకెళ్లి నీటిని తాగిస్తున్నాం. దూర ప్రాంతాలకు పశువులతో వెళ్లడం మాకు కూడా ఇబ్బందిగా ఉంది.

– సాయన్న, పశువులకాపరి, రాయపూర్‌కాండ్లీ

తొట్టిలో నీరు నింపాలి



మా గ్రామంలో నిర్మించిన పశువుల నీటి తొట్టికి పగుళ్లు ఏర్పడటంతో అందులో నీరు నిలువడం లేదు. వేసవిలో నీటి సమస్య అధికంగా ఉంటుంది. పశువుల తొట్టికి మరమ్మతులు చేసి అందులో నీరు నింపాలని అధికారులను కోరుతున్నాం.

– చిన్నారెడ్డి, ధర్మోర

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

తానూరు: రైతుల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని వ్యవసాయ గోదాంలో శనగ పంట కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతులు పండించిన పంటను దళారులకు అమ్మి మోసపోవద్దన్నారు. ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో అన్ని మండలాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని.. సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మహారాష్ట్రలో ఉన్న బంధువుల పంటను ఇక్కడి తీసుకొచ్చి అమ్మవద్దన్నారు. ఇటీవల తానూరు మండలం బెల్‌తరోడా సబ్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో త్రీఫేజ్ కరెంట్ సమస్య తలెత్తగా.. సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ నారాయణ్‌రావ్ పటేల్, వైస్ ఎంపీపీ జల్లావార్ చంద్రకాంత్ యాదవ్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ నాగనాథ్, కృష్ణ, సర్పంచ్ విఠల్, మాధవ్‌రావ్ పటేల్, రాజన్న, పోతారెడ్డి తదితరులు ఉన్నారు.


తానూరులో శనగ పంట కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

చెక్కులు పంపిణీ..

భైంసారూరల్: అన్ని వర్గాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు. శనివారం భైంసా మండల పరిషత్ కార్యాలయంలో 143 మందికి కల్యాణలక్ష్మి, 24 మందికి షాదీముబారక్ చెక్కులు అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ కల్పన, మండల ఉపాధ్యక్షుడు గంగాధర్, ఎంపీటీసీలు రజాక్, మాణిక్, సర్పంచ్‌లు రాకేశ్, ప్రవీణ్, ముత్యం, సతీశ్, కోఆప్షన్ సభ్యులు గజానంద్, సొలంకి భీంరావు, గణేశ్, రాంకుమార్, కృష్ణ, ఆర్ఐ కృష్ణాగౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రొసీడింగ్ అందజేత..

కుంటాల: మండలంలోని కల్లూర్ రజక సంఘ భవన నిర్మాణానికి రూ.రెండున్నర లక్షలు మంజూరయ్యా యి. ఈమేరకు శనివారం భైంసాలో మంజూరుకు సంబంధించిన ప్రొసీడింగ్ కాపీని రజక సంఘం సభ్యులకు అందించారు. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యేను సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. మాజీ సర్పంచ్ బందిరమణగౌడ్, కొత్తపల్లి బుచ్చన్న, బీఆర్ఎస్ సోషల్ మీడియా జిల్లా ఇన్‌చార్జి పెంటవార్ దశరథ్, నాయకులు ముత్యం, కిరణ్, రాజు, లక్ష్మి, సాయన్న, రాజేశ్ ఉన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ఎస్సీ కుల సంఘం..

లోకేశ్వరం: మండలంలోని ధర్మోర గ్రామంలో ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.రెండున్నర లక్షలు మంజూరయ్యాయి. ఈమేరకు శనివారం భైంసాలో నిధుల ప్రొసీడింగ్‌ను ఎస్సీ కుల సంఘం సభ్యులకు అందజేశారు. వైస్ ఎంపీపీ మామిడి నారాయణ్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు సాహెందర్, భోజారెడ్డి, ఆజోబ పటేల్, కులసంఘం నాయకులు భూమన్న, చిన్నదేవు, బాలి సాయమ్మ, సాయన్న, శ్రీకాంత్ ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలని పాదయాత్ర

ఖానాపూర్: తమ సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్ చేస్తూ పంచాయతీ కార్మికులు మండలంలోని తర్లపాడ్ నుంచి ఖానాపూర్ వరకు ఐదు కిలోమీటర్ల మేర పాదయాత్ర చేశారు. పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో తర్లపాడ్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ప్రారంభించిన పాదయాత్ర ఖానాపూర్‌లోని పాతబస్టాండ్ వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి బొమ్మెన సురేశ్ మాట్లాడారు. జీవోనంబర్ 60 ప్రకారం వేతనాలు పెంచి జీవోనంబర్ 51ని సవరించడంతోపాటు కార్మికులకు చెల్లించాల్సిన నాలుగు నెలల పెండింగ్ వేతనాలు విడుదల చేయాలన్నారు. అనంతరం స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన తెలిపి ఎంపీవో చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. నూతన్, నర్సయ్య, శేఖర్, నాగరాజు, స్వామి, గంగాధర్, పోశెట్టి, నర్సవ్వ, సునీత, లక్ష్మి, రాజవ్వ, నర్సయ్య, శంకర్, గంగరాజం తదితరులు ఉన్నారు.



పాదయాత్ర చేస్తున్న పంచాయతీ కార్మికులు

పాఠశాలకు కంప్యూటర్, ప్రింటర్ అందజేత

దస్తురాబాద్: మండలంలోని బుట్టాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలకు గ్రామానికే చెందిన వెన్నమనేని ప్రవీణ్‌రావు రూ.40వేల విలువైన కంప్యూటర్, ప్రింటర్‌ను విరాళంగా అందించారు. శనివారం పాఠశాలలో జరిగిన పోషకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పుట్టిన గ్రామానికి ఏదైనా చేయాలనే ఉద్దేశంతో మా తండ్రి నర్సింగరావు స్మారకార్థం పాఠశాలలో విద్యార్థుల ఆకలి తీర్చేందుకు పండ్లు అందిస్తున్నామని అన్నారు. ప్రధానోపాధ్యాయుడు బ్రహ్మచారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధి పథకాలను వినియోగించుకోవాలి

కడెం: ఉపాధిహామీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని డీఆర్డీవో విజయలక్ష్మి అన్నారు. శనివారం మండలంలోని ధర్మాజీపేట్ గ్రామంలో ఫిష్‌పాండ్ పనులను పరిశీలించారు. అనంతరం ఉపాధి కూలీలతో మాట్లాడారు. కూలీల హాజరు పెరిగేలా చూడాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఏపీవో జయదేవ్, సర్పంచ్ వెంకటేశ్, టీఏ కాంతారావు తదితరులు ఉన్నారు.


పనులను పరిశీలిస్తున్న డీఆర్డీవో విజయలక్ష్మి

కళ్లద్దాలు అందజేత

లక్ష్మణచాంద: మండల ప్రజలు కంటివెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ అడ్వాల పద్మ పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్థానిక వైద్యశిబిరంలో కంటి పరీక్షలు చేసుకున్న వారిలో దగ్గరి చూపు లోపం ఉన్న 80 మందికి శనివారం ఎంపీపీ వారి ఇళ్లకు వెళ్లి కంటిఅద్దాలు అందించారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు సుగుణ, వనజ, ఆశవర్కర్లు శారద, రత్నమాల, తదితరులు పాల్గొన్నారు.

నెమలిని కాపాడిన యువకులు

కుంటాల: వెంకూర్ సమీపాన శనివారం గాయపడ్డ నెమలి కనిపించింది. భైంసాకు చెందిన యువకులు షేక్ మోహిన్, మహ్మద్ సాహిద్ గుర్తించారు. గాయపడ్డ మయూరాన్ని తీసుకుని కుంటాల మండల కేంద్రానికి వచ్చి అటవీ అధికారులకు సమాచారమిచ్చారు. ఎఫ్‌బీవో మీనా అక్కడికి చేరుకోగా ఆమెకు అప్పగించారు. మండల పశువైద్యాధికారి ప్రకాశ్ ఆధ్వర్యంలో ఎఫ్‌బీవో నెమలికి చికిత్స చేయించారు.

సంక్షిప్త వార్తలు

'ఇష్టారాజ్యంగా కార్నర్ మీటింగ్‌లు'

భైంసాటౌన్: సమాచారం ఇవ్వకుండా బీజేపీ ఆధ్వర్యంలో ఇష్టారాజ్యంగా కార్నర్ మీటింగ్‌లు నిర్వహిస్తున్నారని..బీజేపీ పట్టణ మాజీ అధ్యక్షుడు బాలాజీ సూత్రావే ఓ ప్రకటనలో ఆరోపించారు. ఈ మేరకు జిల్లా ఇన్‌చార్జికి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. శక్తి కేంద్ర ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న 129,130,131 బూత్‌లలో శుక్రవారం తాను, కౌన్సిలర్ లేకుండానే కార్నర్ మీటింగ్ నిర్వహించడం సరికాదన్నారు.

ప్రజా ఫిర్యాదుల విభాగం ప్రారంభం

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ప్రతీ సోమవారం ప్రజా ఫిర్యాదులను(అర్జీలు) స్వీకరిస్తున్నట్లు తహసీల్దార్ శ్రీకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. మండల ప్రజలు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పోషకుల సమావేశం

మామడ: మండలంలోని అన్ని పాఠశాలల్లో శనివారం పోషకుల సమావేశం నిర్వహించారు. పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు, ప్రీఫైనల్ పరీక్షలు, ప్రాథమిక పాఠశాలలలో ఎఫ్ఎల్ఎన్ అమలు గురించి పోషకులకు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు వివరించారు.


ఖానాపూర్: మండలంలోని సత్తన్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరారు. శనివారం పాఠశాలలో పోషకులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. ఎంపీపీ మోహిద్, ఎస్ఎంసీ చైర్మన్ రాజేశ్వర్, సీఆర్పీ నొమాని ఉన్నారు.

పుస్తకాలు పంపిణీ

కుంటాల: మండల కేంద్రంలోని పదో తరగతి చదివే విద్యార్థులకు శనివారం అభ్యాసన కరదీపిక పుస్తకాలను ఉపాధ్యాయులు అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు నర్సయ్య పాల్గొన్నారు.

గ్రామాల్లో పనులు పరిశీలన

సారంగపూర్: మండలంలోని గోపాల్‌పేట్, గోపాల్‌పేట్‌తండా, సోనాపూర్, ధని గ్రామాల్లో శనివారం ఎంపీడీఓ సరోజ పర్యటించారు. ఈసందర్భంగా సోనాపూర్‌లో సెగ్రిగేషన్‌షెడ్లు, నర్సరీ, పల్లె ప్రకృతివనం పరిశీలించి సర్పంచ్ రామారావుకు పలు సూచనలు చేశారు. అక్కడి నుంచి గోపాల్‌పేట్‌తండాకు వెళ్లి మురికి కాలువల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. అనంతరం గోపాల్‌పేట్‌కు వెళ్లి పాఠశాలలో మధ్యాహ్న భోజనం, అంగన్వాడీ కేంద్రంలో సౌకర్యాలు పరిశీలించారు. అనంతరం ధని గ్రామంలో పర్యటించి సర్పంచ్ లక్ష్మికి పలు సూచనలు చేశారు. వారి వెంట కార్యదర్శులు ఉన్నారు.


గోపాల్‌పేట్‌తండాలో బ్లీచింగ్ పౌడర్ చల్లిస్తున్న ఎంపీడీఓ సరోజ

అటెన్షన్ ప్లీజ్.. నూతన వంతెన నిర్మించాలి



కడెం: మండలంలోని ధర్మాజీపేట్ పంచాయతీ పరిధిలోని రేవోజీపేట్, కుర్రగూడ గ్రామాలకు వెళ్లే మార్గంలో ఉన్న వంతెన కుంగి ప్రమాదకరంగా మారింది. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించేందుకు ప్రజలు భయాందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి నూతన వంతెన నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: లవకుమార్, పీఆర్ ఏఈ, ఫోన్: 9121135617

నేడు ఎమ్మెల్యే రాక

కుంటాల: మండల కేంద్రంలోని మున్నూరు కాపు సంఘ భవనం ఆవరణలో ఆదివారం ప్రహరీ, మరుగుదొడ్ల నిర్మాణ పనులు ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి ప్రారంభిస్తారని బీఆర్ఎస్ మండల కన్వీనర్ పడకంటి దత్తాత్రి, మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడు తోట రాఘవేందర్ ఒక ప్రకటనలో తెలిపారు.

నేడు ఆలయ వార్షికోత్సవం

ఖానాపూర్: మండలంలోని బాదనకుర్తి గ్రామంలో శ్రీ రాజరాజేశ్వరస్వామి 12వ ఆలయ వార్షికోత్సవం ఆదివారం ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా స్వామి వారికి రుద్రాభిషేకం, బిల్వ పత్రార్చనలు, ప్రత్యేక హారతులు, గణపతి పూజ, పుణ్యాహవచనం, అంకురార్పణ, అఖండ దీప స్థాపన, రుత్వికరణం, మండపారాధాన, శివపార్వతుల కల్యాణం, రుద్రహవనం, పూర్ణాహుతి ఉంటాయన్నారు.

పాఠశాలల్లో వార్షికోత్సవం

నర్సాపూర్(జి): విద్యార్థులకు విలువలతో కూడిన విద్య అందించాలని సర్పంచ్ రాంరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని అరవింద ఉన్నత పాఠశాలలో శనివారం పాఠశాల స్పెక్ట్రమ్ ఫెస్ట్(వార్షికోత్సవం) నిర్వహించారు. చిన్నారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. జెడ్పీటీసీ చిన్నరామయ్య, ఎంపీటీసీ మల్లేశ్, ఎస్సై గీత, కిషన్‌రావు, రమేశ్, గంగారెడ్డి, ప్రిన్సిపాల్ పార్వతీ తివారి పాల్గొన్నారు.

నిర్మల్‌టౌన్: హైదరాబాద్ ఎగ్జిబిషన్ సొసైటీ ఆధ్వర్యంలో నడుస్తున్న జిల్లా కేంద్రంలోని జేవీఎస్ఆర్ ఉన్నత పాఠశాల వార్షికోత్సవం శనివారం రాత్రి నిర్వహించారు. సొసైటీ నిర్వాహకులు శ్యాంసుందర్, కార్యదర్శి సురేందర్, వరుణ్, మంజిత్‌రెడ్డి, అశ్విన్, గోపాలచారి, సాయినాథ్, దయాకర్‌శాస్త్రి, ప్రిన్సిపాల్ నర్సింహరెడ్డి పాల్గొన్నారు.

రైతుబజార్‌లో..

కూరగాయలు	కిలో(రూ.లో)
టమాటా	25
వంకాయ	50
బెండకాయ	40
పచ్చిమిర్చి	60
కాకరకాయ	50
బీరకాయ	70
క్యారెట్	80
గోరుచిక్కుడు	60
కొత్తిమీర	100
అల్లం	50
ఎల్లిగడ్డ	60
ఉల్లిగడ్డ	20
ఆలుగడ్డ	20

- నిర్మల్‌టౌన్

సినిమాలు



తిరుమల : సార్
నారాయణ: క్యంట మేనియా

పోలీసులకు సహకరించాలి

భైంసా: శాంతిభద్రతల పరిరక్షణ కోసం ప్రజలు పోలీసులకు సహకరించాలని ముధోల్ సీఐ వినోద్ అన్నారు. శనివారం ఉదయం బాసర మండలం టాక్లి గ్రామంలో కమ్యూనిటీ కాంటాక్ట్(కార్డన్‌సెర్చ్) నిర్వహించారు. ఈసందర్భంగా సరైన ధ్రువపత్రాలేని 60 బైక్‌లు, ఆటో స్వాధీనం చేసుకున్నారు. అనంతరం గ్రామస్తులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. తనిఖీల్లో ముగ్గురు ఎస్సైలు, ఆరుగురు ఆర్ఎస్సైలు, 60 మంది సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీఐ వినోద్

నట్టల నివారణ మందు తప్పనిసరి

కుభీర్: మండల కేంద్రంలో శనివారం పశువైద్య శిబిరం ఏర్పాటు చేసి 1200 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు తాగించారు. సర్పంచ్ మీరా, పశువైద్యాధికారి విశ్వజిత్, పిరాజీ, ఉపసర్పంచ్ విక్రముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

పేర్కపల్లెలో..

దస్తురాబాద్: జీవాలకు తప్పనిసరిగా నట్టల నివారణ మందు వేయించాలని పశువైద్యాధికారి సుకన్య కోరారు. శనివారం మండలంలోని పేర్కపల్లె గ్రామంలో 300 గొర్రెలకు నట్టల నివారణ మందు తాగించారు. పశువైద్య సిబ్బంది దేవిదాస్ రాథోడ్, మనోజ్, తదితరులు పాల్గొన్నారు.


కుభీర్‌లో శిబిరం ప్రారంభిస్తున్న సర్పంచ్ మీరా

'బీడీ పరిశ్రమ పరిరక్షణకు పోరాడుదాం'

భైంసాటౌన్: తమకు ఉపాధి కల్పిస్తున్న బీడీ పరిశ్రమ రక్షణ కోసం కార్మికులమంతా కలిసి పోరాడుదామని తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు చింత భూమేశ్వర్, ప్రధాన కార్యదర్శి సూర్యశివాజీ పిలుపునిచ్చారు. శనివారం భైంసాలో యూనియన్ స్వర్ణోత్సవ మహాసభల సందర్భంగా జెండా ఆవిష్కరించి మాట్లాడారు. బీడీ పరిశ్రమ ద్వారా కేంద్రానికి ఆదాయం సమకూరుతున్నా.. కార్మిక చట్టాలను రద్దు చేసి కార్పొరేట్ కంపెనీలకు ఊడిగం చేస్తోందని ఆరోపించారు. తంబాకుపై 18శాతం, బీడీలపై 28శాతం జీఎస్టీ విధించిందన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎం.హరిత, పలువురు నాయకులు వెంకటేశ్, రాజేశ్, లింగన్న, లక్ష్మి, సుబ్బలక్ష్మి, సాగర బాయి తదితరులున్నారు.


నినాదాలు చేస్తున్న యూనియన్ నాయకులు